క్లుప్తంగా

బాలల అభివృద్ధికి సహకారం



నృత్యం చేస్తున్న చిన్నారులు

మల్కాపురం: నేటి బాలలే రేపటి పౌరులు.. వారి అభివృద్ధికి అంతా కృషి చేయాలని గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మల్కాపురం శాఖా గ్రంథాలయంలో బుధవారం చిన్నారులకు నృత్యంలో శిక్షణ ఇచ్చారు. ఆయన చిన్నారులకు చదువుతో పాటు ఆట పాటలు నేర్పించాలన్నారు. చదువు విజ్ఞాన్ని అందిస్తే, ఆటలు మానసిక ఉల్లాసం అందిస్తాయన్నారు. కార్యక్రమంలో జాతీయ సేవా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే ధ్యేయం

మల్కాపురం: కార్మికుల సంక్షేమం కోసం పని చేస్తామని టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్క లక్ష్మణరావుయాదవ్ అన్నారు. మే డేను పురస్కరించుకుని టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో కార్మికులకు అందించిన సేవలపై ముద్రించిన పోస్టర్‌ను బుధవారం విడుదల చేశారు.61వ వార్డు ఆర్‌కేపురం ఎన్టీఆర్ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో మజ్జిగ పంపిణీ



వినియోగదారులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న రైతులు

కంచరపాలెం: స్థానిక రైతుబజారులో శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవాన్ని పురస్కరించుకుని రైతులు మజ్జిగ పంపిణీ చేశారు. రైతుబజారు ఎస్టేట్ అధికారి జె.జగదీశ్వరరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వేసవి నేపథ్యంలో వినియోగదారులు, రైతులకు చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రైతులు, డ్వాక్రా మహిళలు, వినియోగదారులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులకు నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు



రాంజీ ఎస్టేట్‌లో నేలకొరిగిన విద్యుత్ స్తంభం, చెట్ల కొమ్మలు

కంచరపాలెం: కంచరపాలెం పరిధి కప్పరాడ, రాంజీ ఎస్టేట్ కొండవాలు ప్రాంతాల్లో బుధవారం తెల్లవారు జామున కురిసిన భారీ వర్షానికి, ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఏపీఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బి.కె.నాయుడు ఆదేశాల మేరకు సిబ్బంది విరిగిన విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేశారు. పారిశుద్ధ్య సిబ్బంది చెట్లకొమ్మలు తొలగించారు.

అరకొర షెల్టర్లు...అవస్థలు

అగనంపూడి: ఓవక్క జోరు వాన... మరోపక్క ఎక్కాల్సిన రైలు బండి ప్లాట్‌ఫారం పైకి వస్తుందనే ప్రకటన. అంతే లగేజీలు, వృద్ధులు, పిల్లలతో ప్రయాణికులు ఉరుకులు పరుగులతో తడిసి ముద్దయ్యారు. దువ్వాడ రైల్వేస్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫారంపై అరకొర షెల్టర్ల కారణంగా ప్రయాణికులు వర్షంలో తడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. బుధవారం మధ్యాహ్నం తిరుమల ఎక్స్‌ప్రెస్ వచ్చే సమయానికి ఉరుములు, మెరుపులతో వర్షం మొదలవ్వడంతో ప్రయాణికులు వారి బోగీలను వెతుక్కుంటూ లగేజీలు, పిల్లలతో పరుగులు తీయాల్సి వచ్చింది. మొదటి ప్లాట్‌ఫారం ప్రధాన భవనానికి రెండు వైపులా రైలు ఆగే వరకు షెల్టర్లు లేకపోవడంతో వంద మీటర్ల వరకు ప్రయాణికులు పరుగులు తీయాల్సి వస్తుంది. అమృత భారత్ కార్యక్రమంలో అయినా ప్లాట్‌ఫారం చివరి వరకు షెల్టర్లు ఏర్పాటు చేసేలా అధికారులు చొరవ తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మైదానానికి మార్గం ఏది?



మరో మార్గం ద్వారా వెళ్లే చోట తవ్వి వదిలేసిన దృశ్యం



ఎంతోమంది అంతర్జాతీయ క్రీడాకారులను అందించిన జింక్ మైదానం

ప్రవేశమార్గంలో పెద్ద సిమెంట్ దిమ్మలు

తవ్వి వదిలేసిన మరో మార్గం

క్రీడాకారుల అవస్థలు

మల్కాపురం: స్థానిక క్రీడాకారులకు చక్కని వేదిక జింక్ మైదానం. ఎంతోమంది జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను అందించిన మైదానం. అయితే ఈ మైదానంలోకి వెళ్లే మార్గం సరిగ్గా లేక, ఇక్కడ మైదానానికి వచ్చే క్రీడాకారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

పారిశ్రామిక ప్రాంతంలో అతి పెద్ద క్రీడామైదానం ఈ జింక్ గ్రౌండ్. అటు కొత్త గాజువాకకు, ఇటు మింది గ్రామానికి అతి సమీపంలో ఉంది. జింక్ యాజమాన్యం అప్పటి రోజులకు తగినట్లుగా, వసతులతో ఏర్పాటు చేసిన ఈ మైదానంలో జింక్ ఉద్యోగులు, వారి పిల్లలతో పాటు పరిసర ప్రాంతాల నుంచి కూడా నిత్యం వందలాది మంది క్రీడాకారులు వస్తుంటారు. పారిశ్రామిక ప్రాంతంతో పాటు గాజువాక, మింది తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వారు క్రికెట్, బాక్సింగ్, అథ్లెటిక్స్‌లో ప్రాక్టీస్ చేస్తుంటారు. ఈ మైదానంలో రాష్ట్ర స్థాయి క్రికెట్, కబడ్డీ, అథ్లెటిక్స్ పోటీలు నేటికీ జరుగుతున్నాయి.

ఇంతవరకు బాగానే ఉన్నా.. మైదానంలోకి క్రీడాకారులు ప్రవేశించే మార్గంలో పెద్ద పెద్ద సిమెంట్ దిమ్మలను ఏర్పాటు చేశారు. మరో మార్గంలో కాలువ కోసం గోతిని తవ్వి, సరిగ్గా పూడ్చలేదు. దీంతో ఆయా మార్గాల ద్వారా క్రీడామైదానంలోకి ప్రవేశించేందుకు క్రీడాకారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. గతంలో ఇక్కడ జింక్ పరిశ్రమ ఉండేది కనుక, వారు ఎలాంటి అసౌకర్యం లేకుండా చర్యలు చేపట్టేవారు. ప్రస్తుతం పరిశ్రమ మూత పడటంతో పరిశ్రమకు చెందిన యజమానులే మైదానంలోకి వాహనాలు వెళ్లకుండా ఉండేందుకు సిమెంట్ దిమ్మలు ఏర్పాటు చేశారని పలువురు ఆరోపిస్తున్నారు.



మైదానంలోకి వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మలు

తవ్వి వదిలేశారు

మైదానంలోకి ప్రవేశించే మార్గంలో దిమ్మను తవ్వి నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో ఆ గోతిని దాటి వెళ్లడం ఇబ్బందిగా ఉంది. సాయంత్రం సమయంలో ఇక్కడ విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో నడివయసు గల వాకర్లు, క్రీడాకారులు ఇక్కడ అదుపు తప్పి, గాయపడుతున్నారు.

– ఆకుల కనకరాజు, జాతీయ అథ్లెట్



సిమెంట్ దిమ్మలు తొలగించాలి

జింక్ మైదానంలోకి ప్రవేశించే మార్గంలో పెద్ద పెద్ద సిమెంట్ దిమ్మలు పెట్టారు. చాలా అసౌకర్యంగా ఉంది. వాహనాలు మైదానంలోకి రాకుండా ఇవి ఏర్పాటు చేశామని అంటున్నారు. కనీసం క్రీడాకారుల వెళ్లేందుకైనా దారి వదిలితే బాగుంటుంది.

– రేష్మాయాదవ్, బాక్సింగ్ క్రీడాకారిణి



ప్రతిభ మ్యాగజైన్ ఆవిష్కరణ



మ్యాగజైన్‌ను ఆవిష్కరిస్తున్న సిస్టర్ షైజీ తదితరులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ప్రతిభా మ్యాగజైన్ హిందీ సంచికను బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ ఆవిష్కరించారు. విద్యార్థినులైన రచయిత్రులకు పత్రిక కాపీలు అందించారు. వారి ప్రతిభ, నిబద్ధతను ప్రశంసించారు. ఎడిటర్, హిందీ విభాగాధిపతి డాక్టర్ పి.కె.జయలక్ష్మి, హిందీ శాఖ అధ్యాపకురాలు డాక్టర్ ఎస్.దీప్తి కృషిని ప్రిన్సిపాల్ షైజీ ప్రశంసించారు. గత 19 సంవత్సరాలుగా ప్రతిభ మ్యాగజైన్ విద్యార్థినుల సృజనాత్మకత వ్యక్తీకరణ ప్రదర్శించడానికి ఒక వేదికగా నిలుస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సిస్టర్లు నాన్సీ, మేరీ, అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

చిత్రకారులకు రవివర్మ స్ఫూర్తి



మాట్లాడుతున్న ప్రముఖ చిత్రకారుడు సుంకర చలపతిరావు

మల్కాపురం: భారతీయ చిత్రకారులకు రాజా రవివర్మ స్ఫూర్తి ప్రదాత అని ప్రముఖ చిత్రకారుడు, కళారత్న సుంకర చలపతిరావు అన్నారు.స్థానిక బి.ఎస్.ఆర్ భవన్ వద్ద బుధవారం చిత్రకళా పరిషత్ ఆధ్వర్యంలో రాజా రవివర్మ జయంతిని నిర్వహించారు. తొలుత రాజా రవివర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన జీవిత విశేషాలను వివరించారు. గాయకుడు డి.త్యాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చిత్రకారులు నాగేశ్వరరావు,బాబ్జి,ప్రకాష్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వాన.. హైరానా



గోపాలపట్నంలో కురుస్తున్న వర్షం

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం తడిసి ముద్దయింది.బుధవారం వేకువ జామున కురిసిన వర్షానికి కాలువలు పొంగి పొర్లాయి. వ్యర్థాలు సర్వీసు రోడ్లపై నిలిచిపోవడంతో అధ్వానంగా మారాయి. వార్డు శానిటరీ సిబ్బంది శ్రమించి వ్యర్థాలు తొలగించారు. శిథిలమైన మార్గాల్లో వర్షం నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ఇబ్బందిపడ్డారు.

కూల్.. కూల్

గోపాలపట్నం: గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం కురిసిన వర్షంతో వాతావరణం చల్ల బడింది. ఉదయం నుంచి చిరుజల్లులు కురిశాయి. సాయంత్రం వర్షంతో మరింత చల్లబడింది. దీంతో ఎండలతో సతమతమైన నగరవాసులు సేద తీరారు.



ములగాడ నుంచి శ్రావణ్ షిప్పింగ్‌కు వెళ్లే మార్గంలో నిలిచిన బురద నీరు



శ్రీహరిపురంలో కురుస్తున్న వర్షం



మల్కాపురం సేవా మార్గంపై నిలిచిన వ్యర్థాలు

‘మల్లం’ ఘటనపై ఎఫ్‌ఐఆర్ నమోదుకు డిమాండ్



నిరసన తెలుపుతున్న దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పారావు, నాయకులు

కంచరపాలెం: కాకినాడ జిల్లా పిఠాపురం మండలం మల్లం గ్రామంలో జరిగిన దళితుల సాంఘిక బహిష్కరణపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, లేకుంటే ఆందోళన ఉద్రిక్తం చేస్తామని దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు హెచ్చరించారు. ఈ ఘటనపై తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఊర్వశి జంక్షన్‌లోని దళిత సేన కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ముందుగా డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఠాపురం మల్లంలో మూడు రోజుల పాటు దళితులను వెలివేసిన ఘటనపై జిల్లా అధికారుల తీరు సరికాదన్నారు. విద్యుత్ ప్రమాదం వల్ల మరణించిన పల్లపు సురేష్ కుటుంబానికి ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని, మృతుడి భార్యకు ప్రభుత్వ ఉద్యోగమివ్వాలని కోరారు. దీనికి కారకులైన నిందితులను కాపాడుతున్న అధికారులపై కూడా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత సేన సిటీ కన్వీనర్ గొల్లమాల మీన, నగర అధ్యక్షుడు పుచ్చ కామేశ్వరరావు, ఉపాధ్యక్షుడు తాటిపూడి సీతారాం, ప్రధాన కార్యదర్శి చింతల మల్లికార్జున, నగర కార్యదర్శి పట్నాల ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లలోకి మురుగు నీరు



రేషన్ డిపోలో మురుగు నీరు చేరడంతో పరిస్థితిని సమీక్షిస్తున్న ఆర్ఐ లక్ష్మి తదితరులు

గోపాలపట్నం: వర్షం కారణంగా మురుగునీరు రేషన్‌డిపోలోకి చేరడంతో పేదలకు చేరాల్సిన బియ్యం పాడయ్యాయి. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి ఎగువ ప్రాంతం నుంచి ఒక్కసారిగా మురుగు నీరు కొట్టుకు వచ్చింది. ఈ నీరంతంగా లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్ ప్రాంతంలోని పలు వీధులతో పాటు ఇళ్లల్లోకి చొరబడింది. ఈ ప్రాంతంలో ఉన్న 14-497నంబర్ గల డిపోలోకి మురగునీరు చేరింది. దీంతో దిగువ ఉన్న రేషన్ బియ్యం బస్తాలు తడిచి పోయాయి.



వీధుల్లోకి కొట్టుకు వచ్చిన వ్యర్థాలు

సుమారు 20 నుంచి 30 బస్తాల బియ్యం తడిసి పోయి ఉంటాయని అంచనా వేస్తున్నారు. రేషన్‌డిపోను స్థానిక కార్పొరేటర్ బొమ్మిడి రమణ, సివిల్ సప్లై ఆర్ఐ లక్ష్మి పరిశీలించారు.

పూడికలు తీయక పోవడమే కారణం...

తరచూ కాల్వల్లో పూడికలు తీయక పోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని స్థానికులు వాపోతున్నారు. జీవీఎంసీ పారిశుధ్య అధికారులు పూడికలు తీయకుండా ఎప్పుడు వ్షాలు వస్తాయో కాల్వల్లో మురుగు కొట్టు పోతుందోనని చూస్తుంటారని విమర్శిస్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విశాఖ చేరుకున్న చినజీయర్ స్వామి



విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న చినజీయర్ స్వామి

గోపాలపట్నం: చందనోత్సవం సందర్భంగా సింహాచలం నృసింహస్వామిని దర్శించుకునేందుకు చినజీయర్ స్వామి బుధవారం సాయంత్రం విశాఖ చేరుకున్నారు. ఆయనకు పలువురు భక్తులు స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గాన సింహాచలం బయలు దేరారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గోపాలపట్నం: శ్రీరామ్ నగర్ 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతులు, చెట్ల తొలగింపు కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. శ్రీరాంనగర్, ప్రశాంతినగర్, సీఎంఆర్ మెయిన్ రోడ్డు, రైల్వే స్టేషన్ ప్రాంతం, నాయుడు క్వార్టర్స్, రైతు బజారు, నరసింహా సినిమాహాలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

‘నవ జీవన వైతాళికులు’ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ కె.ఎస్.చలం, సాహితీవేత్తలు

సీతమ్మధార: ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం విశాఖ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శత వసంతాల రచయిత్రి రాజమ్ కృష్ణన్ రచించిన ‘నవ జీవన వైతాళికులు’ పుస్తకావిష్కరణ సభ బుధవారం ద్వారకా నగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. బసు పోతన ఆహ్వానం పలకగా.. సభాధ్యక్షుడు ఉప్పల అప్పలరాజు స్వాగతోపన్యాసం చేశారు. సాహితీవేత్త, నాటక కర్త పాలిమెరౌట్టి ఫ్రాన్సిస్ శ్రీశ్రీ జయభేరి కవితను వినిపించారు. అరసం 90 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎస్.హనుమంతరావు అరసం చరిత్రను వివరించారు. ముఖ్య అతిథి యూపీఎస్సీ పూర్వ చైర్మన్ ప్రొఫెసర్ కె.ఎస్.చలం పుస్తకాన్ని ఆవిష్కరించి, రచయితకు అభినందనలు తెలిపారు. పుస్తకంలోని మహిళల ఆర్థిక సమానత్వం గురించి మాట్లాడారు. విమర్శకుడు ఆచార్య చందు సుబ్బారావు కవితా శైలిని విశ్లేషించారు. ఏయూ తెలుగు శాఖ ప్రొఫెసర్ డాక్టర్ అన్నంశెట్టి ఈశ్వరమ్మ పుస్తక సమీక్ష చేసి మాట్లాడుతూ దివంగత రాజమ్ కృష్ణన్ అనుభవాలు, అభిప్రాయాలతోపాటు గొప్ప అంశాలు ఈ పుస్తకంలో ఉన్నాయన్నారు. మరో సమీక్షకురాలు అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.సుధ మాట్లాడుతూ రాజమ్ కృష్ణన్ రష్యాలో విహరించి, తన ఆలోచనలను పుస్తకంలో పొందుపరిచారన్నారు. ప్రచురణ కర్త మానవ హక్కుల వేదిక కార్యకర్త పోలిశెట్టి రామకృష్ణ మాట్లాడుతూ ప్రజా నాట్య మండలి గురించి వివరించారు. సోషలిస్ట్ సమాజంలో మహిళా ఎలా ఉండాలో ఈ పుస్తకం చెబుతుందన్నారు. కార్యక్రమంలో కథా రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు, సాహితీవేత్త డాక్టర్ డి.వి.సూర్యారావు, విశాఖ రచయితల సంఘం అధ్యక్షుడు అడపా రామకృష్ణ, రచయిత బండి సత్యనారాయణ, కథా రచయిత మేడా మస్తాన్ రెడ్డి, పద్యకవి సిహెచ్.చిన సూర్యనారాయణ, రాధారాణి, పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష


గోపాలపట్నం: గోపాలపట్నం, ఎన్ఏడీ ప్రాంతాల్లోని పలు కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన పాలిటెక్నిక్ ప్రవేశపరీక్ష పాలిసెట్ ప్రశాంతంగా జరిగింది. గోపాలపట్నం అళ్వార్ దాస్ కళాశాలలో, ఎన్ఏడీ ప్రాంతంలో భాష్యం, గాయత్రి జూనియర్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలు ఇచ్చారు. ఉదయం 9.30గంటలకు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థులను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేసి కేంద్రం లోపలికి అనుమతించారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరిగింది.



పరీక్ష కేంద్రం వద్ద వేచి ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ సిగ్నల్ పాయింట్ నుంచి టోల్ మధ్యలో డివైడర్ పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికుల సమాచారంతో గాజువాక పోలీసులు మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుని వయస్సు 50 నుంచి 55 మధ్యలో ఉంటుందని, గుర్తు పట్టడానికి ఆనవాళ్లు ఏమీ లేవని తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే గాజువాక సీఐ 9440796014, ఎస్ఐ 9642364770 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.



మృతదేహం

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

అల్లిపురం: డ్రైవర్లకు భారీగా జరిమానాలు విధించే 21,31 జీవోను రద్దు చేసి, డ్రైవర్లందరికీ పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ అనుబంధ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. వామన మూర్తి డిమాండ్ చేశారు. 139వ మే డే సందర్భంగా రైల్వేస్టేషన్ ఎదుట బుధవారం నిర్వహించిన మేడే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆటో కార్మికుడు కె. చంటి మేడే పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం 1886 మే 1న అమెరికా దేశం చికాగో నగరంలో కార్మికవర్గం 8 గంటల పని విధానం అమలు చేయాలని పోరాడి అమరులైన అమర జీవులకు జోహార్లు అర్పించారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో బాబు అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెంచి డ్రైవర్లకు ఆహార భద్రత లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్ల హక్కులను హరిస్తే ప్రభుత్వాల పతనం తప్పదని హెచ్చరించారు. మే 20న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో ఆటో డ్రైవర్లు, మోటార్ వాహన డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వాల కళ్లు తెరిపించాలని డ్రైవర్లకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం మేడేని సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో సంఘం జిల్లా నాయకులు వై. వెంకటి, నాయకులు కె. అప్పలరాజు, ఎల్. పరశురాం, పిల్లా శంకర్, ఎస్. అనిల్, వి.సంతోష్, కె. రాము తదితరులు పాల్గొన్నారు.



మేడే వేడుకల్లో పాల్గొన్న వామనమూర్తి తదితరులు

భారతీయ నృత్యానికి విశ్వవ్యాప్త ఆదరణ



శాస్త్రీయ నృత్య ప్రదర్శనలో కళాకారులు

డాబాగార్డెన్స్: భారతీయ నృత్యానికి విశ్వవ్యాప్తంగా ఆదరణ ఉందని శక్తి ఎంపవరింగ్ ఉమెన్ అసోసియేన్ అధ్యక్షురాలు పైడి రజని తెలిపారు. ఇంటర్నేషనల్ డ్యాన్స్ డే సందర్భంగా కాళీ మాతా మందిరం వద్ద శాస్త్రీయ నృత్య పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయ శాస్త్రీయ నృత్యం అన్ని వర్గాల వారి ఆదరణ చూరగొంటుందన్నారు. దీనిని నేటి తరం ప్రోత్సహించాలన్నారు. ఏయూ రిటైర్డ్ ప్రొఫెసర్ వై. సోమలత మాట్లాడుతూ పాశ్చాత్య దేశాల నృత్యం వైపు నేటి యువత మొగ్గు చూపుతుందన్నారు. చిరకాలం నిలిచేది శాస్త్రీయ నృత్యమేనన్నారు. పలు విశ్వ విద్యాలయాల్లో శాస్త్రీయ నృత్యంపై ఉన్న కోర్సులు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు. ప్రముఖ శాస్త్రీయ నృత్య దర్శకురాలు లీలాజగన్ మాట్లాడుతూ శాస్త్రీయ నృత్యానికి ఉన్న ఆదరణ ఎప్పటికీ చెరిగిపోదన్నారు. కార్యక్రమంలో పి. మౌనిక, కె. రుత్విక్, నేహానాయక్, లక్ష్మీ కార్తీక, డి. దక్షిత, ప్రణవ, గ్రీష్మ, దీక్షాశ్రీ, స్నేహాంజలి, భువనేశ్వరి, నృత్య దర్శకురాలు సౌందర్య సురేష్ తదితరులు పాల్గొన్నారు.